GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 55 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | మంగళవారం : అక్టోబర్-29-2024 | పేజీలు : 3

## 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

**టీ మీడియా, అక్టోబర్ 28, హైదరాబాద్:**




తెలంగాణలో 13 మంది ఐఏఎస్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి కలెక్టర్గా నారాయణరెడ్డి, నల్గొండ జిల్లా కలెక్టర్గా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్గా హనుమంతరావు నియమితులయ్యారు.

**బదిలీ అయిన ఐఏఎస్‌లు**

హరీశ్కు విపత్తు నిర్వహణశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు,వినయ్కృష్ణారెడ్డి - ఆర్ అండ్ ఆర్ భూసేకరణ కమిషనర్-వాణిజ్య పన్నులశాఖ అదనపు కమిషనర్గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు-కె. చంద్రశేఖర్రెడ్డి-డెయిరీ కార్పొరేషన్ ఎండీ-ఎస్. దిలీప్కుమార్ - నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్-టి.కె.శ్రీదేవి - పురపాలక శాఖ డైరెక్టర్-మంద మకరందు - సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ - జెడ్.కె. హనుమంతులు - పర్యాటకశాఖ డైరెక్టర్ - దేవాదాయశాఖ సంచాలకులుగా జెడ్.కె. హనుమంతులకు అదనపు బాధ్యతలు-శశాంక- రాష్ట్ర ప్రాధామ్య ప్రాజెక్టుల కమిషనర్ - ఎస్.హరీశ్ - ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్.

# రెండు కూటముల్లో తేలని సీట్ల పంచాయితీ

## మహా వికాస్ అఘాడి'లో సీట్ల వివాదం

### మహాయుతిలోనూ స్పర్ధలు

**టి మీడియా, అక్టోబర్ 28, ముంబై :**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ సమీపిస్తోంది. మంగళవారం (అక్టోబర్ 29)తో చివరి తేదీ ముగియనుంది. కానీ రెండు ఇంకా చాలా పార్టీలు తమ అభ్యర్థులను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించడం జాప్యానికి కొంత కారణమైతే, వివిధ పార్టీలు కలిసి కూటములుగా ఏర్పడ్డ ఈ రాష్ట్రంలో పొత్తులు, సీట్ల సర్దుబాటు అంశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడం కూడా మరో కారణంగా కనిపిస్తోంది. భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని 'మహాయుతి' ఓవైపు, కాంగ్రెస్ సారథ్యంలోని 'మహా వికాస్ అఘాడీ' మరోవైపు హోరాహోరీగా తలపడుతున్న పరిస్థితుల్లో రెండు కూటముల్లోనూ సీట్ల పంచాయితీ ఇంకా కొలిక్కి రాలేదు. మొత్తం 288 నియోజకవర్గాలున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో.. మహా వికాస్ అఘాడి 239 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. మహాయుతి 215 మంది అభ్యర్థులను మాత్రమే ప్రకటించింది. రెండు కూటముల నుంచి దాదాపు నాలుగో వంతు స్థానాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించాల్సి ఉంది. మహాయుతి ఇంకా 73 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా, మహా వికాస్ అఘాడి 49 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.




**మహా వికాస్ అఘాడి'లో సీట్ల వివాదం**

మహావికాస్ అఘాడిలో భాగంగా ఉన్న కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్ బాల్ థాక్రే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(శరద్ పవార్ వర్గం) పార్టీలు ప్రధాన భాగస్వాములుగా ఉండగా.. జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసుకున్న విపక్ష కూటమి లో భాగంగా కమ్యూనిస్టులు, ఆమ్ ఆద్మీ పార్టీ (%ూూూా%) వంటి పార్టీలు కూడా ఈ కూటమిలోనే ఉన్నాయి. అయితే బీజేపీ సారథ్యంలోని కూటమి ఓటమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ (%ూూూా%) మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకుని మహా వికాస్ అఘాడీకి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో బలమైన ప్రాంతీలుగా ఉన్న శివసేన, ఎన్సీపీలు కూటమిలో కాంగ్రెస్ పార్టీకి పెద్దన్న పాత్ర ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. ఇదిలా ఉంటే.. సీట్ల సంఖ్య విషయంలోనూ మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. ప్రాంతాలవారిగా కాంగ్రెస్ బలంగా ఉన్న విదర్భంలో శివసేన 16-17 సీట్లు కోరుతుండగా, అన్ని సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ససేమిరా అంటోంది.వీటన్నింటికీ తోడు మహా వికాస్ అఘాడీలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా తన పేరు ప్రకటించాలని శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే పరోక్షంగా పట్టుబడుతున్నారు. ముందుగానే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాల్సిన అవసరం లేదని, ఎన్నికల ఫలితాల అనంతరం తేల్చుకోవచ్చని కాంగ్రెస్ తెగేసి చెబుతోంది. ఇవన్నీ ఈ కూటమిలో లుకలుకలకు కారణమవుతున్నాయి. అయితే కూటమి పార్టీల మధ్య విభేధాలు ప్రత్యర్థులకు ఆయుధంగా మారతాయని కూటమి నేతలు ఆందోళన చెందుతున్నారు. పట్టువిడుపులు వీడి సర్దుకుపోతేనే విజయం సాధ్యపడుతుందని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ వంటి రాజకీయ కురువృద్ధులు సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు.సీట్ల సంఖ్య విషయంలో శరద్ పవార్ జోక్యంతో మూడు పార్టీలు ముందు తలా 85 స్థానాలకు అభ్యర్థులను సిద్ధం చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఆ క్రమంలో కాంగ్రెస్ 87, శివసేన (ఉద్ధవ్ థాక్రే) పార్టీ 85, ఎన్సీపీ (శరద్ పవార్ గ్రూప్) 67 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటించుకున్నాయి. మరో 49 స్థానాలకు సోమ, మంగళవారాల్లో అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

**'మహాయుతి'లోనూ స్పర్ధలు**

విభేధాలు, స్పర్ధలు కేవలం మహా వికాస్ అఘాడీలో మాత్రమే ఉన్నాయని, బీజేపీ సారథ్యంలోని 'మహాయుతి'లో అంతా బాగానే ఉందని అనుకోడానికి వీల్లేదు. బీజేపీ, శివసేన (ఏక్‌నాథ్ షిండే) పార్టీల మధ్య పెద్దగా విభేధాలు లేకపోయినా.. ఎన్సీపీ (అజిత్ పవార్) వర్గం నుంచే పేచీ ఎదురవుతోంది. కొద్ది నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పనితీరు ఆశించిన మేరకు లేదు. అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు డిమాండ్ చేయడం ఒకెత్తయితే, మిత్రపక్షాలు బలంగా ఉన్న స్థానాలను కోరడం మరొకటి. అయితే మహా వికాస్ అఘాడీతో పోల్చుకుంటే ఈ కూటమిలో చెప్పుకోదగ్గ విభేధాలైతే కనిపించడం లేదు. అయినప్పటికీ మహాయుతి ఇప్పటి వరకు ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య మహా వికాస్ అఘాడీ కంటే తక్కువే. కూటమిలో బీజేపీ అత్యధికంగా 121 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. శివసేన షిండే వర్గం నుంచి 45 మంది అభ్యర్థులు, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం నుంచి 49 మంది అభ్యర్థులను ప్రకటించారు. మొత్తంగా 215 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. ఇంకా 73 స్థానాలకు ప్రకటించాల్సి ఉంది. అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేయడంలో బీజేపీ ముందే ఉన్నప్పటికీ.. ఏకాభిప్రాయం కుదరని స్థానాల విషయంలోనే జాప్యం జరుగుతోంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి తేదీ సమీపించిన నేపథ్యంలో రెండు కూటములు మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసి తుది జాబితాను విడుదల చేయనున్నాయి.



## రతన్ టాటా ఆత్మ సంతోషిస్తుంది: మోడీ

**టీ మీడియా, అక్టోబర్ 28,ఢిల్లీ:**

గత కొన్ని సంవత్సరాలుగా భారత్ స్వావలంబన కోసం శ్రమిస్తోంది. ముఖ్యంగా, రక్షణ రంగంలో ఇతర దేశాలపై ఆధారపడడాన్ని గణనీయంగా తగ్గించాలన్న కృషితో, ఆయుధాలు, రక్షణ రంగ పరికరాలను దేశీయంగా తయారుచేయడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో దేశ రక్షణ రంగ ఉత్పాదన పరిశ్రమలో నేడు కీలక ఘట్టం చోటుచేసుకుంది. గుజరాత్ లోని వడోదరలో మిలిటరీ రవాణా విమానాల ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభమైంది. స్పెయిన్

మిగతా 3లో..

## మోడీ మిత్రుల కోసం 'పాలసీల మీద పాలసీలు'

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

**టీ మీడియా, అక్టోబర్ 28, వయనాడ్ :**



తన స్నేహితులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రధాని మోడీ పాలసీల మీద పాలసీలు రూపొందిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. సోమవారం వయనాడ్‌లోని మీనంగడిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిజెపి తన పాలనలో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని అన్నారు. మణిపూర్ హింసాకాండ గురించి ప్రస్తావిస్తూ..

మిగతా 3లో..



## ఫ్యామిలీ పార్టీనా.. రేవ్ పార్టీనా..?

### అసలేం జరిగింది

**టీ మీడియా, అక్టోబర్ 28, హైదరాబాద్ బ్యూరో:**

జన్వాడ ఫామ్ హౌస్ పార్టీపై పొలిటికల్ ఫైట్ పీక్ స్టేజ్‌కు చేరింది. ప్రధాన పార్టీల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. ఫామ్ హౌస్‌లో రేవ్ పార్టీ జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. సీసీ ఫుటేజ్ రిలీజ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అటు.. ఫ్యామిలీ పార్టీని రేవ్ పార్టీగా ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీజేపీపై బీఆర్ఎస్ భగ్గుమంది. ఇంతకీ.. జన్వాడ ఫామ్‌హౌస్‌లో జరిగింది ఫ్యామిలీ పార్టీనా?.. రేవ్ పార్టీనా?.. అసలు.. మొత్తం ఎపిసోడ్‌పై పోలీసు ఎంక్వైరీలో ఏం తేలబోతోంది?..తెలంగాణ పాలిటిక్స్ ఒక్కసారిగా హీటెక్కాయి. ఇప్పటికే.. గత రెండు, మూడు రోజులుగా దీపావళి పండుగ వేళ పొలిటికల్ బాంబులు పేలతాయన్న మంత్రి పొంగులేటి కామెంట్స్ కాక రేపుతున్నాయి. అధికార, విపక్షాల మధ్య పొలిటికల్ బాంబులు టార్గెట్‌గా మాటలయుద్ధాలు నడుస్తున్నాయి. సరిగ్గా ఇలాంటి సమయంలోనే సడెన్‌గా జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ ఇష్యు తెరపైకి రావడం తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేగింది. దాంతో.. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు విరుచుకుపడ్డారు. డ్రగ్స్ కల్చర్‌కు వ్యతిరేకమని చెప్పిన బీఆర్ఎస్ నేతలు.. ఫామ్ హౌస్ పార్టీ వ్యవహారంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ప్లాన్ ప్రకారం ఫామ్ హౌస్ పార్టీని కాంగ్రెస్ నేతలు వివాదాస్పదంగా మార్చారని ఆరోపించారు మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. ఈ ఎపిసోడ్ మొత్తంలో పోలీసుల తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇక.. ఫామ్ హౌస్ పార్టీ అంశంలో రాజకీయాలకు అతీతంగా చట్టప్రకారం వ్యవహరించాలన్నారు టీ.బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి. ప్రభుత్వ పాలనతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు కక్ష సాధింపు చర్యలు దిగడం కాదని నిజాన్ని నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు.జన్వాడ ఫామ్ హౌస్ వ్యవహారంలో సీరియస్‌గా ఎంక్వైరీ జరగాలన్నారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. ఫామ్ హౌస్‌లో ఏం జరిగిందో తేలాలంటే ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు.ఇదిలావుంటే.. ఫామ్ హౌస్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఖండించారు బీఆర్ఎస్ నేతలు. కొత్తగా ఇల్లు కట్టుకుని ఫ్యామిలీ పార్టీ చేసుకుంటే.. రేవ్ పార్టీ అని ప్రచారం చేస్తారా అని మండిపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు చెప్తోన్న పొలిటికల్ బాంబులు ఇవేనా?.. అని ప్రశ్నించారు.మొత్తంగా.. జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. రేవ్ పార్టీ అని కాంగ్రెస్.. కాదు.. ఫ్యామిలీ పార్టీ అంటూ బీఆర్ఎస్.. మధ్యలో సీసీ ఫుటేజ్ రిలీజ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తు్ను నేపథ్యంలో.. అసలు.. ఫామ్‌హౌస్ పార్టీపై పోలీసులు ఏం తేలుస్తారో చూడాలి.

## ఖమ్మం, ఎనుమాములకు పోటెత్తిన పత్తి

- పడిపోయిన ధరలు
- క్వింటా 6200 దాటడం లేదు
- అధికారులు, వ్యాపారులు కుమ్మక్కు అయ్యారని ఆరోపణ


**టీ మీడియా, అక్టోబర్ 28,వరంగల్/ ఖమ్మం :**



పత్తి మార్కెట్లకు సోమవారం పెద్ద ఎత్తున పత్తి బస్తాలు వచ్చాయి. రెండు రోజుల సెలవుల అనంతరం మార్కెట్ తెరచుకోవడంతో మార్కెట్లకు పత్తి పోటెత్తింది. ఖమ్మం మార్కెట్‌కు ఖమ్మంతో పాటు పొరుగు జిల్లాల నుంచి రైతులు పెద్దమొత్తంలో పత్తి బస్తాలు తీసుకొచ్చారు. అయితే.. పత్తి ధర భారీగా పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలు ధర ?6200 దాటడం లేదని అంటున్నారు. మార్కెట్ అధికారులు వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆరోపిస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎనుమాములలోనూ అంతే..**

వరంగల్ జిల్లాలోని ఎనుమాముల మార్కెట్‌కు పత్తి భారీగా వచ్చింది. అయితే.. బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు మాత్రం రోజురోజుకు తగ్గుతున్నాయి. శుక్రవారం నాటికంటే ?200 ధర తగ్గిందని రైతులు చెబుతున్నారు. కూలీలు, రవాణా ఖర్చులు బాగా పెరిగాయని, తేమ శాతం పేరుతో ధర తక్కువగా ఇస్తుండటంతో నష్టపోతున్నామని వాపోతున్నారు. వ్యాపారులంతా సిండికేట్ అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మార్కెట్ అనే పేరే తప్ప తమకేమీ లాభం లేదని చెప్పారు. వర్షాల వల్ల ఈ సారి పత్తి దిగుబడి తగ్గిందని వెల్లడించారు.



## ఉచిత గ్యాస్ సిలిండర్

### పథకానికి నిధులు విడుదల

**టీ మీడియా, అక్టోబర్ 28,అమరావతి:**

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏపీ ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించిన సంగతి తెలిసిందే. దీపావళి సందర్భంగా ఈ నెల 31 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం కానుంది. కాగా, తాజాగా కూటమి ప్రభుత్వం ఈ పథకానికి నిధులు విడుదల చేసింది. ఉచిత గ్యాస్ సిలిండ్ పథకానికి సంబంధించి తొలివిడతలో రూ.895 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. గ్యాస్ కంపెనీలు, పౌరసరఫరాల ఉమ్మడి ఖాతాలకు నిధులు సమకూరుస్తుంది.ఇక, ఈ పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నారు. అయితే ముందుగా వినియోగదారులు గ్యాస్ సిలిండర్ కోసం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. సిలిండర్ డెలివరీ అయిన రెండు రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వం ఖాతాదారుల ఎకౌంట్లలో నగదు జమ చేస్తుంది. పట్టణ ప్రాంతాలు వారికి%ెా% పేమెంట్ చెల్లించిన 24 గంటల్లో డీబీటీ ద్వారా డబ్బును జమ చేస్తుంది. అదే, గ్రామాల్లోని వారికి 48 గంటల్లో నగదు జమ అవుతుంది.

## అదానీకి షాక్




### విద్యుత్ లైన్ ఒప్పందాన్ని సస్పెండ్ చేసిన కెన్యా

**టీ మీడియా, అక్టోబర్ 28, నైరోబీ :**

కెన్యాలో అదానీ గ్రూప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ట్రాన్స్‌మిషన్ లైన్లు సహా విద్యుత్ మౌలిక సదుపాయాల నిర్మాణం, నిర్వహణ కోసం ప్రభుత్వ రంగంలోని కెన్యా ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని కెన్యా హైకోర్టు సస్పెండ్ చేసింది. 30 ఏళ్ల కాలానికి సంబంధించిన ఒప్పందంపై ఈ రెండు కంపెనీలు ఈ నెల ప్రారంభంలో సంతకాలు చేశాయి. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూపులో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ కంపెనీ కూడా ఉంది. ఒప్పందాన్ని సవాలు చేస్తూ లా సొసైటీ ఆఫ్ కెన్యా దాఖలు చేసిన కేసుపై నిర్ణయం తీసుకునే వరకూ 736 మిలియన్ డాలర్ల అగ్రిమెంటును అమలు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. ఒప్పందాన్ని రహస్యంగా చేసుకున్నారని, రాజ్యాంగం ప్రకారం దానికి విలువ లేదని కెన్యా లా సొసైటీ వాదిస్తోంది. రెండు కంపెనీలు తమ ఒప్పందంలో ప్రభుత్వానికి అర్థవంతమైన భాగస్వామ్యం కల్పించాల్సి ఉంటుందని, 2021వ సంవత్సరపు కెన్యా పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ చట్టం ప్రకారం అది తప్పనిసరి అని తెలిపింది. చట్ట ప్రకారం ఆఫ్రికా దేశమైన కెన్యాలో ప్రయివేటు కంపెనీలు ప్రభుత్వ రంగ ప్రాజెక్టులను చేపట్టవచ్చుకాగా 30 ఏండ్ల పాటు నైరోబీ విమానాశ్రయ అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి కెన్యా ప్రభుత్వం, అదానీ గ్రూపునకు చెందిన మరో కంపెనీకి మధ్య కుదిరిన ప్రతిపాదిత ఒప్పందాన్ని కూడా లా సొసైటీ, మరికొన్ని గ్రూపులు న్యాయస్థానంలో సవాలు చేశాయి. ఈ ఒప్పందం ఆర్థికంగా లాభదాయకం కాదని, పైగా ఉద్యోగాలు కూడా పోతాయని సొసైటీ వాదించింది. దీనిపై గత నెలలో స్పందించిన న్యాయస్థానం తుది నిర్ణయం తీసుకునే వరకూ విమానాశ్రయ ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది

## కూరగాయలు అమ్మినట్లుగా మద్యం అమ్మకాలు

**టీ మీడియా, అక్టోబర్ 28, తణుకు:**



కూరగాయలు అమ్మినట్లుగా నడిరోడ్డు మీదే మందు అమ్ముతున్నరు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సంతలో ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడు నడి రోడ్డు మీదనే మద్యం అమ్ముతూ కనిపించాడు. దీన్ని చూసిన ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో ఇది వైరల్‌గా మారింది. ఈ వీడియోను షేర్ చేసిన మాజీ మంత్రి, వైసీపీ మహిళా నేత రోజా సెల్వమణి కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు... చిన్న పిల్లల్ని, విద్యార్థుల్ని పెట్టి మద్యం అమ్మిస్తున్నారని రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎక్కడో కాదు.. చంద్రబాబుకు ఓటేసిన ఆంధ్రప్రదేశ్‌లోనే అని తెలిపారు. జగనన్న విద్యాంధ్రప్రదేశ్ కోసం పనిచేస్తే.. చంద్రబాబు రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారని రోజా ఆరోపించారు. తణుకులో ఇలా విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు వెలిశాయని

మిగతా 3లో..

# పెద్దల యాదిలో...

## శ్మశానంలో వెలుగుపూల సందడి



**టీ మీడియా, అక్టోబర్ 28,కరీంనగర్ బ్యూరో :**
సాధారణంగా ఇంటి వద్ద దీపాలు పెట్టి, టపాసులు పేల్చి దీపావళి పండుగను జరుపుకుంటారు. కానీ కరీంనగర్‌లో మాత్రం అందరూ శ్మశానానికి వెళ్లి సమాధుల మధ్య దీపాల వెలుగుల సందడిలో ఆత్మీయుల అనుబంధ యాదిని గుర్తు చేసుకోవటం ఆనవాయితీ. చక్కగా సమాధులను అలంకరించి పెద్దలను స్మరించుకుంటూ అక్కడే టపాసులు కాల్చి.. సరదాగా పండుగను జరుపుకుంటారు. దీపావళి పండుగ రోజున అందరూ దేవుళ్లను పూజిస్తారు. కానీ కొన్ని సామాజికవర్గాల కుటుంబాలు మాత్రం సమాధుల వద్ద పూజలు నిర్వహించి చనిపోయిన తమ పూర్వీకులను గుర్తుచేసుకుంటారు. ఇది కాస్త వింతగా కొందరు భావించటం సహజమే.. కానీ ఉన్నప్పటికీ చనిపోయిన వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పండుగను జరుపుకోవడం అనుబంధం, ఆత్మీయతను స్మరించుకునే అద్భుత పండుగ ఇది.

### సమాధుల వద్ద దీపావళి

ఈ ఆచారాన్ని ఆరు దశాబ్దాలకు పైగా ఇక్కడ కొనసాగుతోంది. పూర్వీకులను స్మరించుకుంటూ తమ కుటుంబీకులను ఖననం చేసిన శ్మశాన వాటికలో సమాధుల వద్ద దీపాలు వెలిగించి వేడుక చేసుకుంటారు. కరీంనగర్ కారా?నా గడ్డలోని హిందూ శ్మశాన వాటికలో ఏటా దళిత కుటుంబాలు తమ కుటుంబీకుల సమాధుల వద్దనే దీపావళి పండుగను జరుపుకుంటాయి. పండగకు వారం రోజుల ముందే శ్మశాన వాటిక వద్ద శుభ్రం చేసి సమాధులకు రంగులు వేస్తారు. తమ ఆత్మీయుల సమాధుల వద్దకు కుటుంబ సభ్యులంతా వెళ్లి అక్కడ అంత శుభ్రం చేసిన తరువాత పూలతో సమాధులను అలంకరిస్తారు.

### ఆ తరం యాదిలో.. ఈ తరం

దీపావళి నాటికి సమాధులను ముస్తాబు చేసి పండుగ రోజున సాయంత్రం కుటుంబ సభ్యులంతా సమాధుల వద్దకు చేరుకుని అక్కడే గడుపుతారు. సమాధుల వద్ద పండుగ జరుపుకుంటే తమ వారితో కలిసి ఉన్న భావన వస్తుందని స్థానికులు చెబుతుంటారు. అందుకోసమే చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా ఆబాల గోపాలమూ తమ పూర్వీకులకు ఇష్టమైన వంటలు కూడా వండి సమాధుల వద్ద నైవేద్యంగా పెడతారు. పితృ దేవతలకు నైవేద్యాలు సమర్పించిన అనంతరం వారిని స్మరించుకుంటూ వారి సమాధుల వద్ద పూజలు చేస్తారు. ఉపాధి కోసం వెళ్లి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా దీపావళి పండుగకు మాత్రం కచ్చితంగా కరీంనగర్ కు చేరుకుని తమ కుటుంబ సభ్యులతో కలిసి సమాధుల వద్ద పండుగ జరుపుతారు. కొత్త బట్టలు వేసుకొని పిల్ల పాపలతో సాయంత్రం ఆరుగంటలకు సమాధుల వద్దకు వచ్చి అక్కడే రెండు గంటలు గడిపి తిరిగి ఇళ్లకు వెళుతుంటారు. తమ పూర్వీకులు లేనిదే తాము లేమని, తమకు జన్మలేదని .. తమకు జన్మను ప్రసాదించిన పెద్దల యాదిలో కొన్ని గంటలైనా గడపటమే తమకు నిజమైన దీపావళి అని ఇక్కడి ప్రజలు చెబుతుంటారు.

# నకిలీ లాయర్లు..

- 107 మందిని తొలగించిన బార్ కౌన్సిల్




**టీ మీడియా, అక్టోబర్ 28,న్యూఢిల్లీ:**
దేశ రాజధాని ఢిల్లీలో నకిలీ లాయర్ల (%ఖుఎవ శ్రీఖుఽఎవతీం%) సంఖ్య పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) దీనిపై దృష్టిసారించింది. గత ఐదేళ్లలో ఒక్క ఢిల్లీలోనే107 మంది నకిలీ న్యాయవాదులను తొలగించింది. లాయర్ల సమగ్రత, వృత్తి నైపుణ్యాన్ని కొనసాగించడానికి ఈ డ్రైవ్ చేపట్టినట్లు బార్ కౌన్సిల్ తెలిపింది. ఇందులో భాగంగా 2019 నుంచి 2024 అక్టోబర్ వరకు ఢిల్లీలో 107 మంది నకిలీ లాయర్లను తొలగించినట్లు పేర్కొంది. ఈ నిర్ణయాత్మక చర్య ద్వారా నకిలీ న్యాయవాదులను, చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేని వారిని తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు బార్ కౌన్సిల్ తెలిపింది. అక్టోబర్ 26న ఈ మేరకు ఒక స్టేట్‌మెంట్ విడుదల చేసింది.కాగా, ప్రజల విశ్వాసాన్ని, అనైతిక పద్ధతుల నుంచి న్యాయ వ్యవస్థను రక్షించడానికి బార్ కౌన్సిల్ ప్రయత్నిస్తున్నదని బీసీఐ కార్యదర్శి శ్రీమంతో సేన్ తెలిపారు. ఇందులో భాగంగా ఒక్క ఢిల్లీలో 107 మంది నకిలీ న్యాయవాదుల పేర్లను రిజిస్టర్ జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. 2019 నుంచి 2023 జూన్ 23 వరకు వేల మంది నకిలీ న్యాయవాదులు నమోదైనట్లుగా గుర్తించినట్లు వివరించారు. సమగ్ర విచారణ తర్వాత వారిని తొలగిస్తున్నట్లు వెల్లడించారు.మరోవైపు కొందరు వ్యక్తులు నకిలీ సర్టిఫికేట్‌లతో న్యాయవాదులుగా వ్యవహరిస్తున్నారని శ్రీమంతో సేన్ తెలిపారు. తప్పుడు పత్రాలు, వివరాలతో న్యాయ మండలిలో పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ క్రియాశీల పరిశీలన తర్వాత నకిలీ లాయర్లను గుర్తించి తొలగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరికొందరి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వివరించారు.

## మతాలకతీతంగా కార్యక్రమాలు సంతోషకరం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**టీ మీడియా, అక్టోబరు 28, వనపర్తి బ్యూరో :**
వనపర్తి ముస్లిం యూత్ పండుగ ఉత్సవాలు గ్రీన్ పార్క్ నందు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. సన్మానం,ఫాతిహాలు అన్నదాన కార్యక్రమం తరువాతమంత్రి కి శుభాకాంక్షలు తెలుపుతూ అందరూ కలిసికట్టుగా కుల మతాలకతీతంగా ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ సంతోషంగా ఉండాలని సందేశం ఇచ్చినారు.ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్ , వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్ , కౌన్సిలర్ భారతీయ ప్రేమనాథరెడ్డి, కౌన్సిలర్ బండారు కృష్ణ, నాయకులు డానియల్, కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, బి ఆర్ ఎస్ నాయకులు సయ్యద్ జమీల్, జోహేబ్ హుస్సేన్, ఆరిఫ్, ఏకే పాషా , అలిం , ముధసిర్, అస్లం, ఖలీల్, నయుం తన్వీర్, సయ్యద్, అద్నాన్, ఆసిఫ్ ,జుబేర్ పాల్గొన్నారు.

## సీఎం కాన్వయ్‌కి యాక్సిడెంట్




**టీ మీడియా, అక్టోబర్ 28,హైదరాబాద్:**
కేరళ సీఎం పినరయి విజయన్ కాన్వయ్‌కి ప్రమాదం జరిగింది. తిరువనంతపురంలోని వామనపురంలో ఓ కార్యక్రమానికి రోడ్డు మార్గంలో వెళ్లి వస్తుండగా స్కూటర్ అడ్డు వచ్చింది. దీంతో ముందు వాహన అత్యవసరంగా బ్రేకులు వేయడంతో సీఎం కారుతో పాటు కాన్వాయ్ లోని ఐదు వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదు ఎస్కార్ట్ వాహనాలు ధ్వంసం కాగా.. సీఎం పినరయి విజయన్‌కు ఏమి కాకపోవడం అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సీఎం కాన్వాయ్ అక్కడి నుంచి వెళ్లిపోగా.. పాక్షికంగా ధ్వంసం అయిన ఓ పోలీసు వాహనాన్ని పక్కకు నెట్టి మిగిలిన కాన్వాయ్ కూడా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.



## చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కీలక ఆదేశాలు

**టీ మీడియా, అక్టోబర్ 28,హైదరాబాద్:**
తెలంగాణ సచివాలయ భద్రతా సిబ్బందికి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. సిబ్బంది కదలికలు, సోషల్ మీడియాపై నిఘా ఉందని వెల్లడించారు. పోలీసు అధికారులపై రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వాట్సాప్ గ్రూప్‌ల నుంచి ఎగ్జిట్ కావాలని సూచించారు. ప్రభుత్వం, పోలీస్ శాఖకు వ్యతిరేకంగా వచ్చే పోస్టులను షేర్ చేయవద్దని, లైక్ కొట్టవద్దన్నారు. తప్పు జరిగితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.





## శబరిమల ప్రసాదాలు రెడీ

- 40లక్షల అరవణ డబ్బాలు సిద్ధం
- నిత్య ఉత్పత్తి లక్ష్యం 1.25 లక్షల అప్పామ్‌లు
- టీడీబీ అధ్యక్షుడు ప్రశాంత్ వెల్లడి

**టీ మీడియా, అక్టోబర్ 28,తిరువనంతపురం :**
తులమాస పూజతో శబరిమల ఆలయం తెరుచుకుంది. ఈ నెల 30న ప్రారంభమయ్యే చితిర అట్ట విశిష్ట పూజ 31న ముగుస్తుంది. ఇక కార్తీక మాసం అడుగులు పెడుతున్న వేళ%ఔ% మండల. మకర వైలక్కు సీజన్ల ఆరంభం నేపథ్యంలో ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) కీలక నిర్ణయాలు తీసుకుంది. మండల కళా ప్రారంభోత్సవానికి 40 లక్షల అరవణ డబ్బాలను సిద్ధంగా ఉంచాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుందని టీడీబీ అధ్యక్షులు పీఎస్ ప్రశాంత్ తెలిపారు. “అక్టోబర్ 18 నుంచి ప్రారంభమైన అరవణ ఉత్పత్తికి అవసరైన పదార్థాలను తాము నిల్వ చేసినట్టు ఆయన వివరించారు. రోజుకు 1.25 లక్షల వరకు అప్పామ్‌లను ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని బోర్డు కలిగి ఉంది. ఇది రోజువారీ డిమాండ్ 1.10 లక్షలను సులభంగా తీరుస్తుంది. గత తీర్థయాత్ర సీజన్‌లో, అరవణ అమ్మకాలతో ?146.99 కోట్ల ఆదాయం చేకూరింది.

## విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తాం

- 10మంది డాక్టర్లు, 20 మంది నర్సులతో సేవలు



**టీ మీడియా, అక్టోబర్ 28,పెద్దపల్లి బ్యూరో:**
ముత్తారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో అస్వస్థతకు గురై పెద్దపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. విద్యార్థుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ఆరా తీశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ%ఔ% అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. 10మంది డాక్టర్లు 20మంది నర్సులతో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి కారణమైన విషయంపై ప్రాథమిక ధర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.వసతి గృహం పక్కనే ఉన్న డంప్ యార్డును అక్కడి నుండి తీసివేయాలని అధికారులను ఆదేశించారు. పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల నుంచి పోలీస్‌లు తొలగింపు



**టీ మీడియా, అక్టోబర్ 28,హైదరాబాద్:**
సెలవుల్లో మార్పులు, ఇతర డిమాండ్లతో ఆందోళనలు చేపట్టిన తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకుంది. తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్న 10 మందిని గుర్తించి.. ఆర్టికల్ 311 ప్రకారం ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది. పోలీస్ మాన్యువల్‌కు విరుద్ధంగా వ్యవహరించడం, ఆందోళనలను రెచ్చగొట్టడం, మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ, సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ క్రమశిక్షణను ఉల్లంఘించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్టు పేర్కొంటూ డీజీపీ కార్యాలయం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.ఉద్వాసనకు గురైన సిబ్బంది వీరే3వ బెటాలియన్ కానిస్టేబుల్ జి.రవికుమార్.. 6వ బెటాలియన్ కానిస్టేబుల్ కె.భూషణ్‌రావు.. 12వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుల్ ఎస్‌కే షరీఫ్.. 17వ బెటాలియన్ ఏఆర్ఎస్సై సాయిరామ్, కానిస్టేబుళ్లు కె.లక్ష్మీనారాయణ, ఎస్.కరుణాకర్‌రెడ్డి, టి.వంశీ, బండెల అశోక్, ఆర్.శ్రీనివాస్‌లను విధుల్లోంచి తొలగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఆదివాసీ గూడాల్లో దండారి సంబరాలు

- అడవి బిడ్డల గుండెల్లో ఆనందోత్సహాలు



**టీ మీడియా, అక్టోబర్ 28,ఆదిలాబాద్ :**
ఆదివాసీ గూడాల్లో అంగరంగ వైభవంగా దండిగా సాగే దండారి పండుగ సంబరం మొదలైంది. డప్పుల దరువులు , గజ్జెల మోతలు , గుస్సాడీ నృత్యాలతో అడవి తల్లి మురిసి పోనుంది. దండారి అంటేనే ఆదివాసీ గూడేల్లో సంబరాల వేడుక. యేటా ఆదివాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవత ‘ఏత్మాసార్ పేన్’ పేరిట చేసే ప్రత్యేక పండుగతో దండారి పండుగ ప్రారంభమవుతుంది. దీపావళికి ముందు భోగి పండుగతో ప్రారంభమై.. కొలబొడితో పండుగ ముగిస్తుంది. పక్షం రోజుల పాటు సాగే ఈ వేడుక తరతరాల సంప్రదాయాన్ని కొనసాగించే అద్భుత పండుగగా నిలుస్తోంది. అడవి తల్లి ఒడిలో అంగరంగవైభవంగా సాగే దండారి పండుగ ఆచారాలు , వ్యవహారాలు , సంస్కృతి , సంప్రదాయాలు.. కట్టుబొట్టు రూపాలేంటో మీరు ఓ సారి తెలుసుకోవాలనుకుంటే ఆదివాసీల ఖిల్లా అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ వచ్చేయండి.ఆశ్వీయుజ పౌర్ణమి మరుసటి రోజు.. భోగి పండుగతో మాలధారణ వేసి.. పది రోజుల పాటు కఠిన దీక్షను తీసుకుంటారు గుస్సాడీలు. దీక్ష పూర్తయ్యే వరకు స్నానాలు ఆచరించకుండా , ఒంటిపై నీటి చుక్క కూడా పడకుండా.. కాళ్లకు చెప్పులు దరించకుండా.. చలిలో ఒంటిపై ఎలాంటి వస్త్రాన్ని కప్పుకోకుండా అర్థ నగ్నంతోనే గడుపుతారు. నేల పైనే కూర్చోవడం, నేలపైనే నిద్రించడం గుస్సాడీల ఆచారం. గుస్సాడీల్లో పోరీలది మరింత ప్రాముఖ్యత. ఆడ వేషధారణలో ఉండే యువకులను ఆదివాసీలు పోరీలని పిలుస్తారు. ఏ ఊరికి వెళ్లినా.. ఏ ఇంటిని సందర్శించిన ఈ పోరీలు మంగళహారతులతో అష్ట, ఐశ్వర్యాలు కలగాలని, కుటుంబ సభ్యులందరికీ సుఖశాంతులు కలగాలనీ దీవిస్తారు.దీపావళి పండుగనే ఆదివాసీలకు పెద్ద పండుగ.. అందులో భాగంగానే గోండులకు ఆరాధ్యదైవమైన ఏత్మాసూర్ పద్మల్‌పురి కాకో ఆలయానికి భక్తజన దండు కదిలింది. మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరంలో కొలువై ఉన్న పద్మల్ పురి కాకో ఆలయానికి తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర , చత్తీస్‌గఢ్, ఒడిస్సా ప్రాంతాల నుంచి ఆదివాసులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి.. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.దండారీ పండుగ అంటేనే ఐక్యమత్యానికి నిదర్శనం. ఈ పండుగ వేళ ఆదివాసీ గ్రామాల గిరిజనం ఒక ఊరు నుండి మరో ఊరికి విడిదికి వెళ్లడం ఆనవాయితీ. మారు మూల గిరిజన గ్రామాల గిరిజనం దండారి పండుగ వేళ ఓ గ్రామం నుండి దండారి బృందంతో మరో గ్రామానికి బయలు దేరి వెళుతారు. అలా చేయడం ద్వారా రెండు గ్రామాల మధ్య సత్సంబంధాలు , భాందవ్యాలు పెరుగుతాయని చెప్తారు ఆదివాసీ పటేళ్లు. ఇలా విడిదికి వెళ్లే దండారీ బృందం కాలినడకనే ఎంచుకుంటారు.. అందులోను రాత్రి పూట మాత్రమే వెళ్లడం వారి ఆచారం. రాత్రంత నృత్యాలు చేస్తూ, రేలారేలా ఆటపాటలతో.. గోండి హాస్యపు నాటికలు ప్రదర్శించి ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తారు ఈ గుస్సాడీలు. తెల్లవారగానే కాలకృత్యాలు తీర్చుకుని మాన్‌కోలాతో నృత్య ప్రదర్శనలు చేసి సాయంత్రం సార్‌కోలాతో ముగిస్తారు. ఈ సందర్భంగా వచ్చిన అథితులకు ఘన స్వాగతం పలికి.. ప్రత్యేక విందును ఏర్పాటు చేసి అతిధులకు వీడ్కోలు పలుకుతారు ఆదివాసీలు. అలా తమ గూడానికి వచ్చిన గుస్సాడీలతో ఆత్మీయ బంధం ఏర్పడి.. రెండు గూడాల మధ్య స్నేహబంధం మరింత బలపడి.. తరతరాలుగా కొనసాగిస్తున్న సంస్కృతీ సంప్రదాయల పరిరక్షణకు తోడ్పడుతుందనేది వారి భావన.దండారి పండుగ వేళ ఆదివాసీలు కొలిచే ఆరాధ్య దేవత పద్మల్‌పురికాకో. ఈ పండుగలో ఏత్మాసార్ పేన్ పేరిట నాల్గు సగ(గోత్రం)లలో ఉత్సవాలు జరుపుకుంటారు గిరిజనులు. నాల్గు సగలవారు అంటే గుమ్మేల, 5 సగల వారు అంటే ఫ్రర, 6 సగల వారు అంటే కోడల్, 7 సగల వారు అంటే తపల్ పేరిట ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. ఈ దండారి వేడుకల్లో భేటికోలా, మాన్‌కోలా, సదర్‌కోలా, కోడల్‌కోలా, సార్‌కోలా, కలివల్‌కోలా అనే నృత్యాలు చేయడం ఆదివాసీలకే సొంతం. పేర్లు ఎంత వైవిధ్యం గా ఉన్నాయో వారి ఆటపాటలు కూడా అంతే వైవిద్యం గా సాగుతాయి. చచోయ్ ఇట్ కోలారా.. దేనే దేనారా.. రేలా.. రేలా.. లాంటి ఆట పాటల నడుమ పద్మల్‌పురి కాకో ఆలయం వేదికగా దండారి ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతాయి.ఈ దండారి పండుగ వేళ మహారాష్ట్ర , చత్తీస్‌గఢ్ , తెలంగాణ లోని ఆదివాసీలు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి తీరంలోని ఆరాధ్యదైవం పద్మల్‌పురి కాకో ఆలయంలో దండారి వేడుకలు అంగరంగవైభవంగా జరుపుతారు. పద్మల్‌పురి కాకో ఆలయాన్ని దండారి ఉత్సవ వేదికగా ఆదివాసులు భావిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గుస్సాడి నృత్యాలు ప్రారంభించి, దీపావళి వరకు తమ తమ గూడేల్లో జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారు. దీపావళి రెండు రోజుల తరువాత కొలబొడితో ఈ దండారి వేడుకలు ముగిస్తాయి. తమ కార్యక్రమాలు, అతిథుల రాకపోకలు పూర్తి కాగానే గ్రామంలోని దండారి బృందం ఇంటింటికీ వెళ్లి దర్శనం ఇస్తారు. దీంతో ఇంటి గృహిణి ఓ పల్లెంలో ధాన్యాలు, తోచిన నగదు ఉంచిన హారతిని వారికి అందిస్తారు. దానిని వారు సంతోషంగా స్వీకరించి ఇంట్లో అందరూ బాగుండాలని, పాడిపంటలు సమృద్ధిగా పెంపొందాలని పాటలు పాడుతూ హారతి పూజ ఇస్తారు. ఇలా అన్ని ఇండ్లు పూర్తి కాగానే.. కొలబొడి నిర్వహించి కార్యక్రమాన్ని ముగిస్తారు. ఛలో ఇంకెందుకు ఆలస్యం.. ఇంత అపురూప వేడుకను కనులరా చూసోద్దాం పదండి.. పచ్చని ప్రకృతిలో అంతే స్వచ్ఛంగా సాగే దండారి దండి సంబురాలను తిలికించి తరిద్దాం రండి.

## మోడీ మిత్రుల కోసం ‘పాలసీల మీద పాలసీలు’

(మొదటిపేజీ తరువాయి...)

దేశంలో మైనారిటీలపై ప్రణాళిక ప్రకారం దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రభుత్వం మైనారిటీల మధ్య ద్వేషాన్ని, ఆగ్రహాన్ని వ్యాపింపచేయడం మళ్లీ మళ్లీ చూస్తున్నామని అన్నారు. సామాన్య ప్రజలకు బదులుగా తన మిత్రులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రధాని మోడీ పలు ప్రభుత్వ పథకాలను ప్రవేశపెడుతున్నారని మండిపడ్డారు.ఈ నెల 22న నామినేషన్ సమర్పించిన తర్వాత ప్రియాంక గాంధీ వయనాడ్‌లో పర్యటించడం ఇది రెండోసారి. నామినేషన్ దాఖలుకు ముందు తన తల్లి ప్రియాంక గాంధీ, సోదరుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, ఇతర రాష్ట్ర నాయకులతో కాల్పెట్టలో భారీ రోడ్‌షో నిర్వహించిన సంగతి తెలిసిందే.ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రారుబరేలి, వయనాడ్ రెండు స్థానాల్లోనూ భారీ మెజార్టీతో గెలిచారు. అయితే ఒక స్థానానికే ప్రాతినిధ్యం వహించాల్సి రావడంతో.. రాహుల్ రారుబరేలీ వైపు మొగ్గు చూపారు. దీంతో వయనాడ్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దేవ్యాప్తంగా 47 అసెంబ్లీ స్థానాలతో పాటు వయనాడ్‌కి నవంబర్ 13న ఉప ఎన్నికలు జరగనున్నాయి.

## రాష్ట్రంలో బలహీన పడిన ఆవర్తనం

### పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు



**టీ మీడియా, అక్టోబర్ 28, హైదరాబాద్ :**
బంగాళాఖాతంలో గత నాలుగు రోజుల క్రితం ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారింది. అది మరింత బలహీనపడి ఆవర్తనంగా మారినట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఇది ఒడిశా తీర ప్రాంతంపై కొనసాగుతుందని చెప్పారు. అయితే ఈ ఆవర్తనం మరింత బలహీన పడటం వల్ల వర్షాలకు ప్రస్తుతం అవకాశం లేదన్నారు. తెలంగాణతో పాటుగా ఏపీలోనూ వర్షాలు కురిసే అవకాశం లేదన్నారు.రాష్ట్రంలో చల్లని గాలులు వీస్తూ.. క్రమంగా చలి పెరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే పగటి ఉష్ణగ్రోతలు విపరీతంగా పెరుగుతున్నాయి. కొన్ని జిల్లాల్లో అయితే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలకు కూడా చేరుకుంటున్నాయి. తీవ్రమైన వేడి గాలులు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోతున్నారు.ఇక సాయంత్రం కాగానే వాతావరణం పూర్తిగా మారిపోతుంది. సాయంత్రం వేళల్లో, రాత్రి, తెల్లవారుజామున చలి తీవ్రత పెరుగుతోంది. ఉన్నట్లుండి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 18 డిగ్రీల కనిష్ఠానికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఇలాంటి వాతావరణమే ఉంది.

## కూరగాయలు అమ్మినట్లుగా మద్యం అమ్మకాలు

(మొదటిపేజీ తరువాయి...)

అన్నారు. టీడీపీ నేతలే మద్యం షాపులు, బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇళ్ల మధ్యలో, మహిళలు నడిచే మార్గాల్లో చిన్న పిల్లల్ని పెట్టి ఇలా మద్యం అమ్ముతున్నారని చెప్పారు. ఇదేనా మంచి ప్రభుత్వం అని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించారు. పిల్లల్ని పెట్టి మద్యం అమ్మించడం భావ్యమేనా అని ప్రశ్నించారు.నడిరోడ్డుపై మద్యం అమ్ముతున్న వీడియో వైరల్ కావడంతో ఏపీ పోలీసులు సీరియస్ అయ్యారు. వెంటనే మద్యం విక్రేతలు షేక్ మున్నా, కొప్పిశెట్టి శివశంకర్ కొల్లి సుకన్యలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7800విలువైన 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

## రతన్ టాటా ఆత్మ సంతోషిస్తుంది: మోడీ

(మొదటిపేజీ తరువాయి...)

ప్రధానమంత్రి పెడ్రో శాంచెజ్ తో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ ఈ పరిశ్రమను ప్రారంభించారు. ఈ మిలిటరీ కార్గో విమానాల పరిశ్రమను ఎయిర్ బస్ సంస్థ సహకారంతో టాటా సన్స్ సంస్థ నెలకొల్పింది. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. రతన్ టాటా ఉంటే ఈ కార్యక్రమం చూసి ఎంతో సంతోషించేవారని, ఈ పరిశ్రమ ఏర్పాటుతో రతన్ టాటా ఆత్మ సంతోషిస్తుందని అన్నారు. ఈ పరిశ్రమంతో మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ద వరల్డ్ కార్యాచరణ మరింత దృఢతరం అవుతుందని తెలిపారు.



## పబ్స్‌పై హైకోర్టు ఘాటు కామెంట్స్..

- పోలీసులకు కీలక ఆదేశాలు

**టీ మీడియా, అక్టోబర్ 28,హైదరాబాద్**
పబ్‌ల తీరుపై హైకోర్టు సీరియస్ అయింది. పబ్‌లకు వచ్చేవాళ్ల వ్యవహారం పైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. బడాబాబులు సంపాదిస్తుంటే వాళ్ల పిల్లలు పబ్బుల దగ్గర హంగామా చేస్తున్నారంటూ జస్టిస్ విజయ్‌సేన్ ఘాటు కామెంట్లు చేశారు. బడా బాబుల పిల్లలు%ఔ%ర్యాష్ డ్రైవింగ్‌లు చేస్తూ యాక్సిడెంట్లు చేస్తున్నారన్నారు న్యాయమూర్తి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోనే 60 దాకా పబ్బులు ఉన్నాయని, పబ్‌ల వల్ల రోడ్ నెంబర్ 12, రోడ్ నెంబర్ 36లలో రోజుకో ప్రమాదం జరుగుతోందని జస్టిస్ విజయ్‌సేన్ వ్యాఖ్యానించారు. పబ్బుల దగ్గర ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టాలని, పబ్‌లు కూడా ప్రత్యేక ఏర్పాట్లు, నిబంధనలు పాటించాలన్నారు న్యాయమూర్తి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారుజన్వాడ ఫైల్స్ కేసు విచారణ సందర్భంగా అడిషనల్ అడ్వొకేట్ జనరల్%ఔ%జస్టిస్ విజయ్‌సేన్ బెంచ్‌కి వచ్చారు. విచారణ పూర్తయిన క్రమంలో పబ్బుల విషయంలో ఏఏజీతో న్యాయమూర్తి కీలక కామెంట్లు చేశారు. మీరు ఇక్కడే ఉన్నారు కదా? పబ్బుల విషయంలో ఎందుకిలా జరుగుతోందంటూ ఏఏజీని న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రమాదాలను నివారించేందుకు పబ్బుల బయట స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, పబ్‌లకు మరిన్ని నిబంధనలు విధించాలని ఏఏజీకి సూచించారు హైకోర్టు జస్టిస్ విజయ్‌సేన్.